క్లుప్తంగా

గంధ మహోత్సవం ప్రారంభం



గంధ మహోత్సవంలో దర్గావద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు

పామూరు: స్థానిక సీఎస్‌పురంరోడ్డులోని హజరత్ మహబూబ్ సుభాని దర్గా 49వ గంధ మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్గాలో పలువురు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని మొక్కులు తీర్చుకుని ముజావర్ల దీవెనలు పొందారు. గంధ మహోత్సవంలో హిందూ, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సీఐ, ఎస్సైలు, పలువురు నాయకులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గంధ మహోత్సవం సందర్భంగా సీఐ ఎం భీమా నాయక్ ఆధ్వర్యంలో పామూరు ఎస్సై టి.కిషోర్ బాబు, సీఎస్‌పురం ఎస్సై ఎం వెంకటేశ్వరనాయక్, వెలిగండ్ల ఎస్సై కృష్ణపావని ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో దర్గా కమిటీ భక్తులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

టంగుటూరు: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధన్‌రాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలోనే పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని సూచించారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకం, గోపూజ



అభిషేక పూజల్లో పాల్గొన్న ఈఓ, ఛైర్మన్, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామికి అభిషేకం అనంతరం గోపూజ, మహానివేదన అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ పంచామృతాలతో స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం చేశారు. అనంతరం మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి సమర్పించారు.

కల్తీ మద్యం నిషేధించాలని నేడు వైఎస్సార్ సీపీ ధర్నా

కందుకూరు: రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని నిషేధించి పేద ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో భాగంగా సోమవారం స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అనంతరం ఎక్సైజ్‌శాఖ అధికారులను కలిసి వినతి పత్రం అందజేస్తారనిరా పార్టీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ కార్యాలయ వర్గాలు పిలుపునిచ్చాయి.

గుక్కెడు నీటికి గంపెడు కష్టాలు



తాగునీటి పథకం వద్దకు వెళ్లి ప్రమాదకరంగా నీరు తోడుకుంటున్న గ్రామస్తులు



పొట్టిరెడ్డిపాలెం లోని గ్రౌండ్‌ఫ్లోర్ ట్యాంక్ వద్ద వృథాగా పోతున్న తాగునీరు

- వారం రోజులుగా నాలుగు గ్రామాలకు నిలిచిన రామతీర్థం జలాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పొట్టిరెడ్డిపాలెంలో వృథాగా పోతున్న రామతీర్థం నీరు
- పట్టించుకోని అధికారులు

మద్దిపాడు:

మండలంలో గత వారం రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఉదయం భానుడు ఉగ్రరూపం దాలుస్తుండగా..సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి మోస్తారు వర్షం కురుస్తూనే ఉంది. భారీ వర్షాలకు కొన్ని గ్రామాల్లో వాగులు, వంకలు సైతం పొంగి పొర్లాయి. వారంరోజులుగా ఇదే పరిస్థితి. అయితే మద్దిపాడు మండలంలోని పలు గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఓ వైపు వర్షాలు కురుస్తున్నా నీటి ఎద్దడి మాత్రం ఆ గ్రామస్తులను వెంటాడుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో గుక్కెడు మంచినీటి కోసం గ్రామస్తులు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

వారం రోజులుగా ఇదే పరిస్థితి..

మండంలోని గంగపాలెం, దుగ్గిరెడ్డిపాలెం, రాజుపాలెం, మద్దిపాడు గ్రామాలకు గత వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామశివారులోని స్కీంకు సంబంధించిన గ్రౌండ్ ఫ్లోర్‌ట్యాంక్ వద్దకు వెళ్లి ట్యాంక్ ఎక్కి ప్రమాదకరంగా తాడు సాయంతో నీరు లాక్కొని తీసుకెళుతున్నారు. రామతీర్థం జలాలు సరఫరా కాకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో చేతిపంపు నీటిని సేవిస్తున్నారు. ఫ్లోరైడ్‌శాతం అధికంగా ఉన్న చేతి పంపు నీరు సేవించడం వల్ల తలనొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరాలు వస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. మద్దిపాడు పంచాయతీ పరిధిలో ఉన్న సుమారు 4 వేల మందికి మాత్రమే తాగునీరు అందడం లేదని గ్రామస్తులు అంటున్నారు. మరో పక్క పొట్టిరెడ్డిపాలెంలో ఏర్పాటుచేసిన గ్రౌండ్‌ఫ్లోర్ ట్యాంక్ వద్ద రామతీర్థం నీరు నిత్యం వృథాగా పోతున్నాయి. అయినా అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్‌ను వివరణ కోరగా.. రామతీర్థం జలాయం వద్ద ఉన్న రెండు మోటార్లలో ఒక మోటార్ చెడిపోయింది. దీంతో ఒక మోటార్ ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నాం. మద్దిపాడు స్కీంకు సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయింది. మరమ్మతులు చేయించి తీసుకొచ్చాం. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి తాగునీరు అం దిస్తాం.

> **సాగర్ నీరు ఆదుకోండయ్యా**
>
> 
>
> గత వారం రోజులుగా మంచినీళ్లు రావడం లేదయ్యా.. చాలా దూరంవెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. బిందె మోయలేక పోతున్నా. మోకాళ్లు సైతం నొప్పులు వస్తున్నాయి. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. సాగర్‌నీళ్లు ఇవ్వండయ్యా.
>
> – ఇనుకొల్లు రత్తమ్మ, మద్దిపాడు

అలా వదిలేశారు..!

- అర్ధంతరంగా నిలిచిన సచివాలయ, ఆర్‌ఎస్‌కే, విలేజ్ క్లినిక్‌లు
- వాటి ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం
- ప్రభుత్వం తీరుపై సర్వత్రా విమర్శలు



వాలిచర్లలో అర్ధంతరంగా నిలిచిన సచివాలయం

హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సచివాలయాల నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి నిర్మాణాలను పూర్తిగా గాలికొదిలేసింది. ఏ ఏ ప్రాంతాల్లో నిర్మాణలు ఏ దశలో ఉన్నాయో అని ఒక్క సమావేశంలోనూ వీటి గురించి చర్చించలేదు. ఫలితంగా కొన్ని గ్రామాల్లో నిర్మాణం పూర్తయి ప్రారంభానికి నోచుకోకపోగా మరికొన్ని గ్రామాల్లో సగం పూర్తయిన భవనాలు కూటమి ప్రభుత్వ తీరును వెక్కిరిస్తున్నాయి. మండల పరిధిలోని వాలిచర్ల, సీతారాంపురం, తిమ్మారెడ్డిపల్లి, లింగంగుంట్ల, నందనవనం, ముప్పాళ్లపాడు, పెద్దగొల్లపల్లి, కొండారెడ్డిపల్లి, వేములపాడు పంచాయతీల్లో సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కొన్ని పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తయినా ప్రారంభించకపోవడంతో ఆ కార్యాలయాలను అద్దె భవనాల్లో చాలిచాలని గదుల్లో నిర్వహిస్తున్నారు. హాజీపురం, కూటాగుండ్ల, ముప్పాళ్లపాడు, వేములపాడు, హనుమంతాపురం, నందనవనం సచివాలయాలు, పెద్దగొల్లపల్లి, తిమ్మారెడ్డిపల్లి, హాజీపురం గ్రామాలో రైతు భరోసా, హెల్త్ క్లినిక్‌లు నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోక పిచ్చిమొక్కలు పిలిచి అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని భవనాలు మందుబాబులకు నిలయాలుగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ భవనాలను దృష్టి సారించి పూర్తయిన వాటిని ప్రారంభించి, అర్ధంతంగా నిలిచిన నిర్మాణాలను ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



హాజీపురంలో అర్ధంతరంగా నిలిచిన భవనం



లింగంగుంట్లలో అర్ధంతరంగా నిలిచిన రైతు సేవా కేంద్రం

ప్రభుత్వ వైద్యాన్ని కాపాడుకునేందుకే ఉద్యమం

- మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలి
- ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తోంది
- ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలి
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్



సంతకాల సేకరణ పత్రాలతో వైఎస్సార్ సీపీ నాయకులు

కందుకూరు: ప్రజారోగ్య రంగాన్ని ప్రైవేట్ పరం చేయాలనే ప్రభుత్వ కుట్రను అడ్డుకునేందుకు, మెడికల్ కాలేజీలను ప్రభుత్వ నిధులతోనే నిర్మించాలనే డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఉలవపాడు మండలం వీరేపల్లి గ్రామంలో ఆదివారం పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి మెడికల్ కాలేజీలో విషయంలో ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఆయన వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్య రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి వైద్య రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. పేద ప్రజలకు అందించే ప్రభుత్వ వైద్యాన్ని దూరం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. మెడికల్ కాలేజీలను తన సొంత మనుషులకు అప్పగించడం ద్వారా పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఇప్పటికే పేద ప్రజలకు సంజీవని లాంటి ఆరోగ్యశ్రీ పథకాన్ని అటకెక్కించారని విమర్శించారు. ప్రభుత్వ విధానాలు ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్‌లో పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకునేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోటి సంతకాల ఉద్యమానికి పిలుపునిచ్చారని చెప్పారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని, నియోజకవర్గ వ్యాప్తంగా 70వేల సంతకాలను సేకరించి గవర్నర్‌కి పంపడం జరుగుతుందని చెప్పారు. కావున ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పలుపునిచ్చారు.

ఎమ్మెల్యే అవినీతికి ఆకాశమే హద్దు..

ఇక నియోజకవర్గంలో పాలన పూర్తిగా అవినీతి మయంగా తయారైందని ఆరోపించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అవినీతి, అక్రమాలకు అడ్డూఅదుపు అనేది లేకుండా పోయిందని, అక్రమ సంపాదనే లక్ష్యంగా ఆయన పాలన కొనసాగుతుందని వివరించారు. గుడ్లూరులో కల్తీ మద్యం, ఉలవపాడులో భారీ పేకాట శిబిరాలు ఇందులో భాగమేనని స్పష్టం చేశారు. అలాగే రేషన్ బియ్యం, ఇసుక, గ్రావెల్ దందాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, వీటిలో నేరుగా ఎమ్మెల్యేకి వాటాలు వెళ్తున్నాయని ఆరోపించారు. సారవంతమైన భూములు ఇచ్చేందుకు కరేడు రైతులు నిరాకరిస్తున్నా పోలీసులను అడ్డుపెట్టుకుని బలవంతంగా భూములను లాక్కొంటున్నారని, జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన పోర్టు పనులను పరిశీలించేందుకు వెళ్లితే జిల్లా నాయకులను అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ 15నెలల పాలనా కాలంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేకపోవడంతో ప్రభుత్వ బండారం ఎక్కడ బయటపడుతుందోననే ఉద్దేశంతో పోలీసులను అడ్డుపెట్టుకుని అడ్డుకుంటున్నారన్నారు.

ప్రైవేట్ వ్యక్తులకు అమ్మే కుట్ర ..

నియోజకవర్గ పరిశీలకుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యాన్ని పేద ప్రజలకు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలను ప్రారంభించారని అయితే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మే కుట్ర చేస్తుందన్నారు. బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు విస్తృతంగా పర్యటించి కోటి సంతకాలు ఉద్యమాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆగే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని చెప్పారు. ఉలవపాడు మండల అధ్యక్షుడు నన్నం పోతురాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిశోర్, షేక్ రఫి, కె సాంబశివ రాజు, బిల్లా రమణయ్య, వెంకట్రావు, స్థానిక నాయకులు పి అమర్నాథ్‌రెడ్డి, కేశవరపు జాలిరెడ్డి, నవీన్‌యాదవ్, కోటు కోటిలింగం, వెలిచర్ల చంద్రశేఖర్, షేక్ దస్తగిరిబాషా, జంపని అనూరాధ, తోట మల్లికార్జున, జమ్ము మాధవ, రామక్రిష్ణ, సయ్యద్ ఫజిల్, పాటికల్ మాధవ, లక్కంరాజు శ్రీనివాసరాజు, మురళీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న మనోజ్

మద్దిపాడు: హిందూ ధర్మం ఎంతో గొప్పదని, ఆ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ జిల్లా ప్రచారక్ మనోజ్ కోరారు. స్థానిక శివాలయంలో పంచపరివర్తన్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశాన్ని గౌరవించాలని, దేశ ప్రతిష్టను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పిచ్చయ్య చౌదరి, విశ్వహిందూపరిషత్ మండల అధ్యక్షుడు వనిపెంట గురవారెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యదర్శి పవన్‌కుమార్, నాగ అశ్వని, అశోక్, రాఘవేంద్ర, ఓంకార్‌లు పాల్గొన్నారు.

చిరుజల్లులకే చిత్తడి చిత్తడి



పాలకేంద్రం వద్ద గుంతలో గ్రావెల్ వేసిన గ్రామస్తులు

వలేటివారిపాలెం: చిరుజల్లుకే ఆర్అండ్‌బీ రోడ్డులో గుంతలు ఏర్పడి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం వలేటివారిపాలెం పాలకేంద్రం సమీపంలో గుంతలు ఏర్పడి నీరు నిల్వ ఉంటోంది. గుంతలు ఉండటంతో గ్రామస్తులు కొందరు గ్రావెల్ వేసి రోడ్డును మరమ్మతులు చేశారు. ఎన్నికల తర్వాత స్థానిక ఎమ్మెల్యే వలేటివారిపాలెం నుంచి లింగసముద్రం వరకు డబుల్ రోడ్డు వేయిస్తారని తెలుగు తమ్ముళ్లు ప్రచారం చేసుకుంటున్నారే కాని పనులు మాత్రం చేయించిన దాఖలాలు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనికి తోడు అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

వెంకారెడ్డికి నివాళులర్పించిన డాక్టర్ వెంకయ్య



వెంకారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ మాదాసి, డాక్టర్ బత్తుల, జాలిరెడ్డి

సింగరాయకొండ: మండలంలోని పాకల గ్రామానికి చెందిన గాలి వెంకారెడ్డి మృతదేహానికి ఆదివారం వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ మాదాసి వెంకయ్య, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌టీఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి నివాళులర్పించారు. వెంకారెడ్డి కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కేశవరపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, బుర్ల భాస్కరరెడ్డి, గౌడపేరి రాఘవులు,పసుమర్తి శ్రీను, పామంజి బాబు, నాగూరు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం



ఊళ్లపాలెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983–88 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మర్రి హరిముకుందారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రూ.10 వేల విలువైన బీరువాను బహూకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాకల వెంకటేశ్వరరావు, మేడిద రవీంద్రబాబు, నాటారు శ్రీనివాసులు, ద్వారం వేణుగోపాలరెడ్డి, గొల్లపోతు సుబ్బారావు, బాలాజీ, రమేష్, పేరూరు కాశీనాథ్, నూకసాని బాల మురళి, నరశింహాస్వామి, పుచ్చలపల్లి శ్రీనివాసులు, నాగేంద్రం, రాఘవమ్మ, సుకన్య, సుధామణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నేడు నిరసన ర్యాలీ

కనిగిరిరూరల్: నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమగా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో తయారు చేస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటలకు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ఇంటి వద్ద నుంచి ర్యాలీగా ఒంగోలు బస్టాండ్‌లో ఉన్న ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం ఇస్తామన్నారు. వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్‌లు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ హాజరు కావాలని కోరారు.

జనగణనలో కులగణన చేయాలి



టంగుటూరులో రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు

టంగుటూరు: జనగనణలో కూడా కులగణన కూడా చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం టంగుటూరులో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా సీపీఐ కొండపి సహకార్యదర్శి ప్రభాకర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా యాదవ జేఏసీ నాయకుడు దూళ్ల అప్పారావు మాట్లాడుతూ జనగణనలో కులగణనను కూడా చేసి కులాల దామాషా ప్రకారం రిజర్వేషన్‌ను విస్తృతపరచాల్సిన అవసరం ఉందన్నారు. బహుజనులు చైతన్యవంతులను చేయాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రతి ఒక్కరూ న్యాయపరమైన హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వినియోగదారుల హక్కుల సంఘం జిల్లా నాయకుడు టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీసీ అంటే బ్యాక్ వర్డ్ కాస్ట్ కాదని, బ్యాక్ బోన్ క్యాస్ట్ అనే విషయం సమాజానికి తెలుసునని అందుకే అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు వెన్నుదన్నుగా ఉన్నామని ప్రకటిస్తాయన్నారు. కేవీపీఎస్ నాయకుడు మోజెస్, సీఐటీయూ నాయకుడు టి.రాము, రైతు సంఘం నాయకుడు ఎస్ పేరయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లక్ష్మి, ఆటో వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, గిరిజన నాయకురాలు రమణమ్మ, వడ్డెర సంఘం నాయకుడు సుబ్బారావు, హేతువాద సంఘం నాయకుడు ఎంకే బేగ్, విరసం జిల్లా కన్వీనర్ చల్లపల్లి నరసింహారావు, ప్రజా సంఘాల మహిళా నాయకురాలు విప్లవం సుజాత, కృష్ణ, శ్రీను, షేక్ అలెగ్జాండర్, దేవా పాల్గొన్నారు.

పిచ్చిచెట్ల నడుమ మండల పరిషత్ కార్యాలయం



పిచ్చి మొక్కల మధ్య ఎంపీడీఓ కార్యాలయం

కొండపి: ' పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత, పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటారు అంటూ' గ్రామాల్లో అవగాహన కల్పించి అధికారులు ర్యాలీ నిర్వహిస్తూ ఉంటారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పేరుతో ప్రతి మూడో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి అధికారులు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉన్నారు. కేవలం ఆ కార్యక్రమం మాటలకే పరిమితమైందని కొండపి మండల పరిషత్ కార్యాలయ పరిసరాలు నిదర్శనంగా ఉంది. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పిచ్చి చెట్లలో పాములు పురుగులు ఉంటాయేమోనని కార్యాలయానికి వచ్చే ప్రజలు అధికారులు బిక్కుబిక్కుమంటున్నారు. ఎంపీడీఓ. ఎంపీపీ గదులకు కిటికీలు ఈ పిచ్చి మొక్కల దగ్గరనే ఉన్నాయి. కిటికీల ఎత్తువరకు పిచ్చి మొక్కలు పెరిగినా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రజలకు గ్రామాల్లో అవగాహన కల్పించడం మంచిదే అయినా అధికారులు ఆచరణలో పెట్టకపోవడంతో ప్రజలు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ మొలచిన పిచ్చి మొక్కలను తొలగించాలని కార్యాలయానికి వచ్చే ప్రజలు కోరుకుంటున్నారు.